సాక్షి ఫోకస్‌

సర్కారు బడులు.. సమస్యలు తీరేనా..?

శేరిలింగంపల్లి జోన్‌ బృందం: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది అయినా సమస్యలు తీరతాయా అనే ప్రశ్న అందరిలోనూ కలుగుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మన బడి–మన బస్తీ పథకం నిధులు ఇంకా పూర్తి స్థాయిలో మంజూరు కాలేదు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను మారుస్తామనే ప్రకటనలు ఏటా వింటున్నదే అనే భావన వస్తోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.


హఫీజ్‌పేట్‌ పాఠశాల భవనం దుస్థితి

ఈ సమస్యలపై దృష్టి సారించాలి

- ప్రతి స్కూల్‌లో డెస్క్‌తో కూడిన బెంచీలు, కుర్చీలు, అధునాతన బోర్డులు ఏర్పాటు చేయాలి
- స్కూల్‌కు ఒక వాచ్‌మెన్‌, శానిటరీ జవాన్‌ ఉండాలి
- మధ్యాహ్నం భోజనం వండేందుకు ప్రత్యేక వంటగది, భోజనశాల నిర్మించాలి
- రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్‌కు మరో 10 అదనపు తరగతి గదులు నిర్మిస్తే ఎంతో మేలు
- మధురానగర్‌ పాఠశాలను అప్‌గ్రేడ్‌ చేయాలి
- నానక్‌రాంగూడ, గొలిదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలలను జెడ్పీహెచ్‌ఎస్‌గా అప్‌గ్రేడ్‌ చేయాలి .
- హఫీజ్‌పేట్‌ ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల పెచ్చులూడుతున్నాయి, మరుగుదొడ్ల సమస్య. ఇక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో ఇతర వాహనాలను పార్క్‌ చేస్తున్నారు.
- మియాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్లే గ్రౌండ్‌లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.
- మియాపూర్‌ మక్తామహబూబ్‌పేట్‌ పాఠశాల వెనుక చెత్త డంపింగ్‌యార్డ్‌తో భరించలేని దుర్వాసన, ఈగలు, దోమల బెడద
- మియాపూర్‌ న్యూకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడా గదులు లేవు. ఆడుకోవడానికి స్థలం లేదు. ఒకేచోట అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల కొనసాగింపు
- మియాపూర్‌,రాయదుర్గం, ఖాజాగూడలో జెడ్పీహెచ్‌ఎస్‌, ప్రాథమిక పాఠశాలలు ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి .

ప్రభుత్వ స్కూళ్లకు పలువురి చేయూత..

ప్రభుత్వ పాఠశాలలను ఐటీ సంస్థలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు, ఐటీ ఉద్యోగులు దత్తత తీసుకొంటూ మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కూడా జరుగుతోంది. ఇక కొన్నింటిలో మాత్రం సమస్యలు అలాగే ఉన్నాయి.


లింగంపల్లిలో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

శేరిలింగంపల్లిలోని పాఠశాలల వివరాలు

- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు: 43
- యూపీఎస్‌ స్కూళ్లు : 03
- జెడ్పీహెచ్‌ఎస్‌ స్కూళ్లు : 13
- మొత్తం పాఠశాలల సంఖ్య : 59
- గత ఏడాది విద్యార్థుల సంఖ్య -- 17,220 మంది
- మండలంలో టీచర్ల సంఖ్య : 256 మంది
- ప్రైవేటు పాఠశాలలు : 335 విద్యార్థులు సుమారు 70వేలు

అదనపు గదులకు శంకుస్థాపనలు

- రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్‌లో రూ.1.04 కోట్లతో 8 తరగతి గదులు
- రాయదుర్గం ప్రాథమిక పాఠశాలలో రూ.46 లక్షలతో 4 తరగతి గదులు
- గచ్చిబౌలి జెడ్పీహెచ్‌ఎస్‌లో రూ.52 లక్షలతో..
- గచ్చిబౌలి ప్రాథమిక పాఠశాలలో రూ.23 లక్షలతో..
- లింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో రూ.78 లక్షలతో..
- మాదాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో రూ.78 లక్షలతో..

మండలంలో అవసరమైన పుస్తకాలు లక్ష
- ఇప్పటి వరకు వచ్చినవి 41వేలు
- రానున్నవి 35 వేలు

మనబడి-మన బస్తీకి ఎంపికైనవి..

- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 'మన బడి–మన బస్తీ' పథకం కింద మొదటివిడత 31 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు.
- అందులో శేరిలింగంపల్లి మండలంలో 24 పాఠశాలలు, కూకట్‌పల్లి మండలంలో 7 పాఠశాలలు ఉండగా సకాలంలో నిధులు మంజూరై మౌలిక వసతులు కల్పిస్తే చాలా వరకు సమస్యలు తీరతాయి.

"పాఠశాలల రూపురేఖలు మారనున్నాయి



శేరిలింగంపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు కొదవ లేదు. ప్రభుత్వంతోపాటు ఐటీ, ఇతర సంస్థలు కూడా చేయూత అందిస్తున్నాయి. మనబస్తీ–మనబడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయి. పుస్తకాలు 50 శాతం వచ్చాయి. స్కూల్‌ పాయింట్లకు చేర్చాం. ఈసారి 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు కూడా ఇస్తాం. స్కూల్‌ యూనిఫాంలు సిద్ధంగా ఉన్నాయి.
–వెంకటయ్య, మండల విద్యాధికారి, శేరిలింగంపల్లి


లింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ భవనం


హఫీజ్‌పేట్‌ పాఠశాల ఆవరణలో అక్రమ పార్కింగ్‌


మియాపూర్‌లో జెడ్పీహెచ్‌ఎస్‌, ప్రాథమిక పాఠశాల సముదాయంలో ప్లే గ్రౌండ్‌

క్లుప్తంగా

రక్తదాతలకు సత్కారం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌ కమ్యూనిటీహాల్‌లో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. 25సార్లు రక్తదానం చేసిన వారికి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌, ఉర్దూ యూనివర్సిటీ చీఫ్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రియాజ్‌లు మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రజల్ని చైతన్యపరచడంతోపాటు రక్తదానం పట్ల ఉన్న అపోహలను తొలగించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రతినిధులు మల్లారెడ్డి, జీవీ రావు, జనార్దన్‌, అమ్మయ్య చౌదరి, మహేష్‌రెడ్డి, మహేష్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ పర్యటన

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌ నల్లగండ్ల హుడా కాలనీ, నవోదయ కాలనీల్లో కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ వర్షపు నీరు, మురుగు నిల్వకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీ, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నవోదయ కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, నల్లగండ్ల హుడా కాలనీ వాసులు జలేందర్‌రెడ్డి, రంజిత్‌, పూరి, భరత్‌, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సృష్టి ప్రోగ్రాంకి యశశ్రీ ఎంపిక

రాయదుర్గం: పూణె ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ కంప్యూటర్‌ టెక్నాలజీ అండర్‌ గ్రాడ్యుయేట్‌ యశశ్రీ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని ఐహబ్‌ డేటా స్పాన్సర్‌ చేసిన సృష్టి ఇంటర్న్‌షిప్‌ స్కాలర్‌షిప్‌ను గెలుచుకుంది. ఐ హబ్‌ డేటా ద్వారా సమ్మర్‌ రీసెర్చ్‌ ఇంటర్న్‌షిప్‌ ఆన్‌ టెక్నలాజికల్‌ ఇన్నోవేషన్స్‌ (సృష్టి) ప్రోగ్రామ్‌ కింద ఐహబ్‌ డేటా అకడమిక్‌, రీసెర్చ్‌ స్కిల్స్‌ను మెరుగుపర్చటానికి దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్‌ అండర్‌ గ్రాడ్యుయేట్‌ లనుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. అందులో అత్యుత్తమ ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేశారు.

బండి సంజయ్‌ను కలిసిన రవికుమార్‌ యాదవ్‌



గచ్చిబౌలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్‌ యాదవ్‌ మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేసినందుకు సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శేరిలింగంపల్లిలో బీజేపీ గెలుపు కోసం శాయశక్తుల కృషి చేస్తానని రవికుమార్‌ పేర్కొన్నారు.

'నీట్‌'లో రాణించిన గురుకుల విద్యార్థులు

రాయదుర్గం: 'నీట్‌'లో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటారు. బాలికల కళాశాలలో 80 మంది పరీక్షలు రాశారు. జి సంధ్యకు ఆలిండియాలో 90వ ర్యాంకు, పి ఝాన్సీ ఆలిండియా ర్యాంకు 10,683 సాధించారని ప్రిన్సిపల్‌ శారద తెలిపారు.

బాలుర కళాశాలలో..

గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు చేతన్‌ కుమార్‌ 511 మార్కులతో 3,789 ర్యాంకు, ఆర్‌ జైపాల్‌ 505 మార్కులతో 803వ ర్యాంకు, ఎంహర్షవర్ధన్‌ 451 మార్కులతో 1955 ర్యాంకు సాధించారని ప్రిన్సిపల్‌ వి పాపారావు, వైస్‌ ప్రిన్సిపల్‌ గణేష్‌ పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల పాదయాత్ర

మియాపూర్‌: కాలనీ, బస్తీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్‌ అన్నారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్‌ కాలనీలో 54వ రోజు గడప గడపకు బీజేపీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుభాష్‌చంద్రబోస్‌ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ అధికారంలోకి రాగానే కాలనీలో ఇళ్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

వృద్ధుడు అదృశ్యం

మియాపూర్‌: ఓ వృద్ధుడు వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాని సంఘటన చందానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా, నాగలంక, మర్రిపాలెంకు చెందిన ఎం. సుబ్బారావు(67) వేసవి సెలవుల నిమిత్తం చందానగర్‌ హుడా కాలనీలో ఉంటున్న అల్లుడు శ్రీహరిబాబు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో 12వ తేదీ సాయంత్రం 4.30 గంటల సమయంలో వాకింగ్‌ కోసమని ఇంటి నుండి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, స్నేహితుల వద్ద, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు చందానగర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎమ్మెల్యే గాంధీని కలిసిన టీఎన్‌జీఓ కాలనీవాసులు


ఎమ్మెల్యే గాంధీని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న కాలనీ సంఘం ప్రతినిధులు

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే గాంధీని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం కలిశారు. కాలనీలోని సంక్షేమ సంఘం భవనం మరమ్మతులు, నీటి పన్నుల తగ్గింపు, చెరువు సుందరీకరణ, వాకింగ్‌ ట్రాక్‌ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. బీఆర్‌ఎస్‌ నాయకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు అనంతయ్య, కార్యదర్శి పి ప్రతాప్‌రెడ్డి, వెల్ఫేర్‌ కమిటీ అధ్యక్షుడు విశ్వనాథ్‌, కార్యదర్శి నారాయణరెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సైబరాబాద్‌ కమిషనరేట్‌లో ఓపెన్‌ హౌస్‌ విజిట్‌



రాయదుర్గం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌లో ప్రత్యేక ఓపెన్‌ హౌజ్‌ విజిట్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబరాబాద్‌ కమిషనర్‌ స్టీఫెన్‌ రవీంద్ర ఆదేశాలపై విమెన్‌ అండ్‌ చైల్డ్‌ సేఫ్టీ వింగ్‌ డీసీపీ నితికాపంత్‌ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులను ప్రత్యేక వాహనాలలో సైబరాబాద్‌ కమిషనరేట్‌కు రప్పించి వీడియో చిత్ర ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్‌ ఇన్‌స్పెక్టర్‌ వేణుమాధవ్‌ మాట్లాడుతూ ఓపెన్‌ హౌజ్‌ విజిట్‌లో భాగంగా 300 మంది విద్యార్థినులకు పలు అంశాలను వివరించామన్నారు. పోస్కో చట్టం, గుడ్‌టచ్‌, బ్యాడ్‌టచ్‌, బాలమిత్ర వంటి అంశాలను తెలియజేశామన్నారు. కార్యక్రమంలో విమెన్‌ అండ్‌ చైల్డ్‌ సేఫ్టీ వింగ్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశం, విమెన్‌ పీఎస్‌ ఇన్‌స్పెక్టర్‌ సునీత, భరోసా కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సహకారం


కన్యకాపరమేశ్వరి ఆలయ భూమిపూజలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని బండ్లగూడ పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బండ్లగూడ పరిధిలో ఇప్పటివరకు ఐదు ఆలయాలను నిర్మించినట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్‌ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, పటాన్‌చెరు కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌యాదవ్‌, మాజీ కార్పొరేటర్‌ అంజయ్య, సీనియర్‌ నాయకులు మధుసూదన్‌రెడ్డి, నగేష్‌యాదవ్‌, శ్రీధరాచారి, గోపాల్‌, కాంతారావు, విజయ్‌ పాల్గొన్నారు.

ఇస్నాపూర్‌లో భూమిపూజ

పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌ గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన బీరప్పస్వామి ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ బాలమణి శ్రీశైలం, మాజీ సర్పంచ్‌ వెంకట్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీశైలం, అంజిరెడ్డి, ఉపసర్పంచ్‌ శోభకృష్ణరెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయానికి..

పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని జేపీ కాలనీ పంచముఖి హనుమాన్‌ దేవాలయం ఎదురుగా నూతనంగా నిర్మించతలపెట్టిన కన్యకా పరమేశ్వరి దేవాలయం భూమి పూజకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌యాదవ్‌, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం



గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. బుధవారం పాఠశాలలో చేరిన పిల్లలకు ఉపాధ్యాయులు అక్షరాలు దిద్దించారు. టీచర్లు శైలజ, స్వర్ణలత, రజనీ, వెంకటేశ్వరమ్మ, అమర్‌నాథ్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

నిజాంపేట్‌: మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని నిజాంపేట్‌ కార్పొరేషన్‌ 18వ డివిజన్‌ కార్పొరేటర్‌ కొలన్‌ వీరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌ పరిధిలోని ఎస్‌జేబీ హిల్స్‌లో జరుగుతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆయన వెంట కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, బీఆర్‌ఎస్‌ నాయకులు ఉన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్యే



హఫీజ్‌పేట్‌ : మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని చంద్రనాయక్‌ తండాలో శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో బుధవారం ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, నాయకులు ఎండీ ఇబ్రహీం పాల్గొన్నారు.

ల్యాబ్‌ టెక్నీషియన్‌కు ఉత్తమ అవార్డు

హఫీజ్‌పేట్‌ : దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హఫీజ్‌పేట్‌ పీహెచ్‌సీ ల్యాబ్‌ టెక్నీషియన్‌ పండరిరెడ్డి, స్టాఫ్‌ నర్సు కవితలు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. ఎమ్మెల్యే గాంధీ, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ సృజనలు అవార్డులను అందజేశారు. హఫీజ్‌పేట్‌ పీహెచ్‌సీ డాక్టర్‌ అరవింద్‌, డాక్టర్‌ శైలజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ దేశానికే రోల్‌ మోడల్‌

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్‌: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చందానగర్‌లోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కల్యాణ మండపంలో వైద్య ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 9 ఏళ్ల కాలంలో వైద్య రంగం అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. కేసీఆర్‌ మార్గ నిర్దేశంలో తెలంగాణ దేశానికే రోల్‌ మోడల్‌గా మారిందన్నారు. అనంతరం న్యూట్రిషన్‌ కిట్లను గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, డీఎంహెచ్‌ఓ సృజన, ఉప కమిషనర్లు, వెంకన్న, సుధాంశ్‌, కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ వరదాచారి, డాక్టర్‌ జ్యోతి, అరవింద్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


న్యూట్రిషన్‌ కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ

సమాజ మార్పునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

శేరిలింగంపల్లి: అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లిలో చెగువేరా జయంతిని ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు (కెవిఎల్‌) మాట్లాడుతూ చెగువేరా పోరాట స్ఫూర్తిని యువత, విద్యార్థి లోకం ఆదర్శంగా తీసుకొని సమాజ మార్పుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చెగువేరా జీవితం – పోరాటంపై వ్యాసరచన, చెస్‌ పోటీలను నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్‌ కరస్పాండెంట్‌ రామాచారి, ఏఐపీఎస్‌ఓ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిప్పర్తి మహేష్‌, రవికిషోర్‌, నాయకులు కె. కృష్ణ, భిక్షపతి గౌడ్‌, కృష్ణయ్య, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గీతం స్కాలర్‌కు పీహెచ్‌డీ

పటాన్‌చెరు టౌన్‌: హైదరాబాద్‌ గీతం డీమ్డ్‌ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి గంపా మురళీమోహన్‌కు డాక్టరేట్‌ లభించింది. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ నారాయణ రెడ్డి బుధవారం ఈ మేరకు వెల్లడించారు. నూతన హెటిరో సైక్లిక్‌ సమ్మేళనాల సంశ్లేషణ, వాటి జీవసంబంధ కార్యకలాపాల మూల్యాంకనంపై పరిశోధన ప్రధాన లక్ష్యమన్నారు. మురళీమోహన్‌ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం విశ్వవిద్యాలయం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్‌ డీఎస్‌ రావు, గీతం రెసిడెంట్‌ డైరెక్టర్‌ డీవీవీఎస్‌ఆర్‌ వర్మ, స్కూల్‌ ఆఫ్‌ సైన్స్‌ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ దత్తాత్రి కె.నగేష్‌, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్‌ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

అందరికీ నెగెటివ్‌

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 11 మందికి కొవిడ్‌ ర్యాపిడ్‌ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్‌ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్‌ తెలిపారు. ఆర్టీపీసీఆర్‌ టెస్టులు చేయలేదని తెలిపారు.